సాక్షి చిత్తూరు

శుక్రవారం । 29 । మార్చి । 2024

I



ఉన్నత ఆశయం ముఖ్యం

విద్యార్థులకు ఉన్నత ఆశయం ఎంతో ముఖ్యమని సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కరుణకుమార్ పేర్కొన్నారు. - IIలో



వలంటీర్ల రాజీనామాలు

టీడీపీ నాయకుల వేధింపులు, మాటల తూటాలతో వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శుక్రవారం (సా)	సహర్ శనివారం (ఉ)
చిత్తూరు	6.30	4.49
పుంగనూరు	6.31	4.54

న్యూస్‌రీల్

హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవిరాజు

చిత్తూరు రూరల్: హైరిస్క్ గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి మెరుగైన వైద్యం అందించాలని ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ రవిరాజు ఆదేశించారు. నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం ఇంటిగ్రేటెడ్ హైరిస్క్ ప్రెగ్నెన్సీ ట్రాకింగ్ మేనేజ్‌మెంట్ అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అన్ని ఆస్పత్రుల్లోని గైనికాలజిస్ట్, వైద్యాధికారులు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఈ ఫలితంగా ప్రభుత్వ వైద్య సేవలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయాలన్నారు. గర్భిణులను ఎప్పటికప్పుడు పరీక్షించి వైద్య సేవలు అందించాలని చెప్పారు. మాతా శిశు మరణాల సంఖ్యను తగ్గించేందుకు కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అధికారులు ఉషశ్రీ, మీనా సయ్యద్, జానకీ రావ్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఫిర్యాదుల పరిష్కారం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మోడల్ కోడ్‌కు వ్యతిరేకంగా అందిన 5 ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించారు. ఈ మేరకు జిల్లా ఎంసీసీ నోడల్ అధికారి మురళీ కృష్ణ గురువారం జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్‌కు నివేదికలు పంపారు. జిల్లాలోని గంగాధరనెల్లూరు, కుప్పం నియోజకవర్గాల్లో నమోదైన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆయా ఆర్‌ఓల నుంచి నివేదికలను సేకరించారు. అనంతరం ఫిర్యాదులను పరిష్కరించినట్లుగా ఆ నివేదికలను జిల్లా ఎన్నికల అధికారికి అందజేశారు.

మే 1 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మే 1వ తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బాలాజీ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ మే 1 నుంచి 31వ తేదీ వరకు శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 50 శిక్షణ శిబిరాల నిర్వహణకు రాష్ట్ర క్రీడాభివృద్ధి అధికారులు అనుమతులు ఇచ్చారని తెలిపారు. శిక్షణ శిబిరాలకు క్రీడా సామగ్రి అందజేస్తామన్నారు. వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న పీడీలు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు ఏప్రిల్ 6వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. దరఖాస్తులను dsa.ctr@rediffmail.com మెయిల్‌కు పంపాలని ఆయన వెల్లడించారు.

ఓటింగ్‌పై అవగాహనకు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఓటు వినియోగంపై అవగాహనకు ముద్రించిన పోస్టర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆవిష్కరించారు. కలెక్టరేట్‌లో గురువారం పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఓటు ప్రత్యేకతను తెలిపేందుకు ప్రత్యేకంగా పోస్టర్లను ముద్రించినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఓటు ప్రాధాన్యతను వివరించే కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, ఎన్నికల విభాగం సిబ్బంది ఉమాపతి, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు సకాలంలో మరమ్మతులు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో మరమ్మతు చేయాలని ట్రాన్స్‌ఫార్మర్ విభాగం ఈఈ మహేశ్వరరెడ్డి డీఈ ఆనంద్‌ను ఆదేశించారు. గురువారం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో 48 గంటలు, పట్టణ ప్రాంతాల్లో 24 గంటల్లో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేసి పంపాలన్నారు. ఎండలు పెరుగుతుండడంతో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలిపోతుంటాయని చెప్పారు. వాటిని సకాలంలో బాగుచేయాలని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

కార్మికుల బతుకుల్లో కాంతులు

దశాబ్దకాలంగా కార్మికులకు వేతనాల పెండింగ్ గ్రహణం పట్టుకుంది. గత ప్రభుత్వ హయాంలో పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. పెండింగ్ వేతనాల చెల్లింపుపై ముఖం చాటేసింది. ఏకంగా ఫ్యాక్టరీనే మూత వేయించి చేతులు దులుపుకుంది. ఫలితంగా కార్మికుల బతుకులు వీధిన పడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వం పదేళ్ల నాటి పెండింగ్ వేతనాలను ఒకేసారి చెల్లించింది. దీంతో కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయి. మనోధైర్యంతో కార్మికుల కుటుంబాలు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నాయి. ప్రభుత్వం అందించిన తోడ్పాటుపై కార్మికలోకం నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

- దశాబ్దం క్రితం నాటి వేతనాలు చెల్లించిన ప్రస్తుత ప్రభుత్వం
- షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల కష్టాలకు చెక్
- వేతనాలడిగితే ఫ్యాక్టరీని మూసేసిన గత పాలకులు



చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

చిత్తూరు అగ్రికల్చర్: చిత్తూరు సహకార చక్కెర కర్మాగారానికి ఏళ్ల తరబడి ఆదరణ లేక కునారిల్లిపోయింది. గత పాలకుల తీరుతో ఫ్యాక్టరీ మూతపడడమే కాకుండా, కార్మికులకు అందాల్సిన వేతనాలు కూడా చెల్లించకుండా ముఖం చాటేశారు. నాలుగు దశాబ్దాల పాటు చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ అభివృద్ధి పథంలో నడిచింది. చిత్తూరుకు సమీపంలోని 10 మండలాల పరిధిలోని దాదాపు 16 వేల మంది చెరుకు రైతులకు అండగా నిలిచింది. అలాంటి ఫ్యాక్టరీని గత ప్రభుత్వ హయాంలో 2015 జనవరిలో ఉద్దేశ పూర్వకంగానే నష్టాలు చూపి మూతపడేలా చేసింది. ఫ్యాక్టరీని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికుల వేతనాలను సైతం చెల్లించకుండా మిన్నకుండి పోయింది. కార్మికులు తమ గోడును వెళ్లబోసుకున్నా అప్పటి ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. దీంతో పెండింగ్ వేతనాలపై ఆశలు వదులుకున్న కార్మికుల బతుకులు వీధిన పడ్డాయి.

ప్రస్తుతం కార్మికుల జీవితాల్లో వెలుగులు

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిన వేతనాలు అందుతాయో లేదో తెలియని మీమాంసలో కార్మికుల కుటుంబాలు కొట్టుమిట్టాడాయి. ఇలాంటి తరుణంలో ప్రస్తుత ప్రభుత్వం కార్మికులకు అండగా నిలిచింది. గత ఏడాది జూలైలో కార్మికులందరికీ వేతనాలు చెల్లించింది. దాదాపు పదేళ్లపాటు వంద మంది పర్మినెంట్ కార్మికులు, 450 మంది సీజనల్ కార్మికులకు పెండింగ్‌లో ఉండిన రూ.31.22 కోట్ల వేతనాలను ఒక్కసారిగా చెల్లించింది. దీంతో ప్రతి కార్మికునికి రూ.15 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు పెండింగ్ వేతనాలు చేతికందాయి. ఫలితంగా ఏళ్ల తరబడి దుర్భర జీవితాలను అనుభవిస్తున్న కార్మికుల కుటుంబాల్లో వెలుగులు నిండాయి. అప్పుల ఊబిలో నుంచి బయటపడడమే కాకుండా, వారి పిల్లల చదువులు, పెళ్లిళ్లు, కొత్త ఇళ్ల నిర్మాణం లాంటి చర్యలతో ఆనంద జీవనంలో పడ్డారు.

ఆనందంగా జీవిస్తున్నాం



పెండింగ్ వేతనాలు అందడంతో ఆనందంగా జీవిస్తున్నాం. ఫ్యాక్టరీని నమ్ముకుని 30 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నాం. 2015లో మూతపడడం, వేతనాలు చేతికందక పోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుత ప్రభుత్వం పెండింగ్ వేతనాలు చెల్లించడంతో రూ.34 లక్షలు చేతికందింది. దీంతో మాకున్న అప్పులు తీర్చుకోగా, మా అమ్మాయికి పెళ్లి చేసి, ఇల్లు కట్టుకుని, చిన్న దుకాణం పెట్టుకుని ఎలాంటి చీకూ చింత లేకుండా జీవనం సాగిస్తున్నాం.

– మహ్మద్‌గౌస్, కార్మికుడు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

మా అబ్బాయిని డాక్టర్ చదివించుకున్నాం



గత పదేళ్లుగా పెండింగ్‌లో ఉండిన వేతనాలను ప్రస్తుతం ప్రభుత్వం ఒక్కసారిగా చెల్లించింది. దీంతో నాకు రూ.29 లక్షలు చేతికందాయి. ఈ డబ్బులను మా అబ్బాయి వెటర్నరీ డాక్టర్ కోర్సుకు చేసిన అప్పులు కూడా చెల్లించుకున్నాం. ప్రస్తుతం మా అబ్బాయి డాక్టర్ విద్యను పూర్తి చేసి సంచార పశువైద్య అంబులెన్స్‌లో డాక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కార్మికుల కష్టాలు తెలుసుకుని పెండింగ్ వేతనాలను ప్రభుత్వం ఒక్కసారిగా చెల్లించడం మా అదృష్టం.

– ఇ.ఎస్.వెంకటప్రసాద్, కార్మికుడు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

అప్పులు తీర్చుకుని, ఇల్లు కట్టుకున్నాం



పెండింగ్ వేతనాలపై ఆశలు వదులుకున్నాం. అప్పుల పాలయ్యాం. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రస్తుత ప్రభుత్వం కార్మికులను ఆదుకుంది. ఒకే దఫాలోనే వేతనం మొత్తం చెల్లించడంతో నాకు రూ.18 లక్షలు చేతికందింది. దీంతో చేసిన అప్పులను చెల్లించడమే కాకుండా, సొంత ఇల్లు కూడా నిర్మించుకున్నాం. ప్రస్తుతం షుగర్ ఫ్యాక్టరీలోనే సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ఈ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంది.

– జిఎస్.భాస్కర్, సెక్యూరిటీ గార్డు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

ఆటో కొనుక్కున్నా



నాకు ఒక్క సారిగా పెండింగ్ వేతనం కింద రూ. 20 లక్షల వరకు చేతికందింది. ఈ డబ్బులను మా అబ్బాయి బి టెక్ చదువుకు ఫీజులు చెల్లించి, కొంత మేరకు అప్పులు చెల్లించి, ఇల్లు నిర్మించుకున్నాం..ఆటో కొనుక్కుని దానిద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నా.. వేతనాలు చేతికందక పోవడంతో ఏళ్ల తరబడి చాలా ఆర్థిక ఇబ్బందులు పడ్డాను. ప్రస్తుత ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన తోడ్పాటు ఎప్పటికీ మరచిపోలేం.

-పి.కుమార్, కార్మికుడు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

కష్టకాలంలో ఆదుకున్నారు



ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించి కష్టకాలంలో ఆదుకున్నారు. నాకు రూ.30 లక్షలు చేతి కందింది. దీంతో తాము గతంలో బ్యాంకుల్లో, ప్రైవేటు వ్యక్తుల వద్ద చేసిన అప్పులు చెల్లించుకున్నాం. మిగిలిన డబ్బులతో లెదర్ బ్యాగులు కుట్టే మిషన్ కొనుక్కుని దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో తమ కుటుంబం ఆనందంగా జీవిస్తున్నాం. ఈ ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– ఏ.రాజశేఖర్, కార్మికుడు, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ

పొత్తు ధర్మం చిత్తు?

- చంద్రబాబు సభలు, రోడ్ షోలో జాడలేని మిత్రపక్షాలు
- అవమానంతో ముఖం చాటేసిన రెండు పార్టీల నేతలు
- ఎన్నికల్లో తమ సత్తా చూపుతామంటూ శపథం
- చంద్రబాబు స్థాయికి ఇరుకు సందుల్లో సభలా?



పుత్తూరులో బుధవారం ఇరుకు సందులో రోడ్ షో నిర్వహిస్తున్న చంద్రబాబు

సాక్షి, చిత్తూరు: చంద్రబాబు అంటేనే అవకాశవాద రాజకీయాలకు, కుట్రలు, కుతంత్రాలకు ఆద్యుడు. కేవలం తన అవసరాల కోసమే పొత్తులు, ఎత్తులతో చెత్త రాజకీయాలు చేయడంలో ఆయనదే అగ్రస్థానం. 2014లో తన అవసరాల కోసమే బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని గద్దెనెక్కారు. అధికారంలో భాగస్వామం ఇవ్వాల్సి వస్తుందని వారితో తెగతెంపులు చేసుకున్నారు. 2019లో చిత్తుచిత్తుగా ఓడిపోయారు. తర్వాత అవినీతి కేసుల్లో 52 రోజులు జైలు జీవితం అనుభవించారు. తాజాగా ఎన్నికల్లో మళ్లీ బీజేపీ వద్ద మోకరిల్లారు. ఢిల్లీలో పడిగాపులు కాసి ఎట్టకేలకు ఎన్డీఏ కూటమిలో బెర్తు సంపాదించారు. ఈ ఎత్తుగడ అంతా ఎందుకంటే కేసుల నుంచి తప్పించుకునేందుకేనని అందరికీ తెలిసిపోయింది. అయినా యథావిధిగానే చంద్రబాబు తన ప్రసంగాల్లో మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూనే ఉన్నారు. మరో వైపు తన మార్కు రాజకీయానికి పదును పెట్టారు. ఎన్నికల ప్రచారం నుంచి పొత్తు ధర్మాన్ని పక్కన పెట్టేశారు. కూటమి పార్టీల్లోని మిత్రపక్షాలకు ఏమాత్రం అవకాశం ఇవ్వకపోవడంతో మిత్రపక్షాలు రగిలిపోతున్నాయి.

రోడ్ షో సభల్లోనూ అదే తీరు

పలమనేరు, పుత్తూరు రోడ్ షో సభల్లోనూ చంద్రబాబు తీరులోనూ మార్పులేదు. ఇక్కడ కూడా మిత్రపక్షాల నేతలకు అవకాశం ఇవ్వలేదు. జిల్లాలో బీజేపీతోపాటు జనసేన పార్టీలకు చెప్పుకోదగ్గ నేతలు ఉన్నప్పటికీ వారికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదు. తన ప్రసంగాల్లో కూడా మిత్రపక్ష నేతల పేర్లుగానీ, వారి భాగస్వామ్యం కానీ ఎక్కడా ప్రస్తావించలేదు. కూటమి పార్టీలన్నీ టీడీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని మాత్రం పదేపదే విన్నవించారు.

ఇరుకు సందుల్లో సభలా..

రాజకీయాల్లో 40 ఏళ్ల అనుభవం ఉందంటూ పదే పదే చెప్పుకునే చంద్రబాబు తన స్థాయికి తగిన విధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించటం లేదని సాక్షాత్తూ టీడీపీతో పాటు బీజేపీ, జనసేన నేతలు అభిప్రాయపడుతున్నారు. కుప్పంతోపాటు పలమనేరు, పుత్తూరు నిర్వహించిన సభలు చాలా ఇరుకు సందుల్లో నిర్వహించారు. జనం రారనే ఉద్దేశంతోనే చంద్రబాబు ముందస్తు జాగ్రత్తగా పట్టుమని వందమంది నిలబడలేని సందుల్లో సభలు పెట్టడం గమనార్హం. అయినప్పటికీ ఆశించిన స్థాయిలో జనం రాలేదు. చంద్రబాబు ఎన్నికల ప్రచార వాహనం ముందు చుట్టూ పలుచగా జనం కనిపించడంతో ఏం చేయాలో దిక్కుతోచక తల పట్టుకునే పరిస్థితి ఎదురవుతోంది.

జెండాలు మోయడానికేనా..?

పొత్తు కోసం వెంపర్లాడిన చంద్రబాబు ఆ పొత్తు ధర్మాన్ని ఆచరించటం లేదని బీజేపీ, జనసేన నేతలు లోలోన రగిలి పోతున్నారు. తమకు ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వకుండా అడుగడుగునా అవమానిస్తున్నారని ఆయా పార్టీ నేతలు బాహాటకంగానే చెబుతున్నారు. తమను కేవలం జెండాలు మోయడానికే చంద్రబాబు కరివేపాకులా వాడుకుంటున్నారని వాపోయారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎన్నికల్లో తమ సత్తా చూపాలని ఆ రెండు పార్టీల నేతలు భావిస్తున్నారు.

చంద్రబాబు వన్‌మ్యాన్ షో...

చంద్రబాబు ఎన్నికల ప్రచారాన్ని తాను ప్రాతినిథ్యం వహిస్తున్న కుప్పం నుంచి ఆరంభించారు. ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో ఏకంగా మూడు రోజులు గడిపారు. పార్టీ నేతలు, క్యాడర్‌తో వరుసగా సమావేశాలు నిర్వహించి వారిని మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేశారు. ఎన్నికలకు సమాయత్తం కావాలని దిశానిర్దేశం చేశారు. కానీ, పొత్తు ధర్మాన్ని యథావిధిగా పక్కన పెట్టేశారు. తన ప్రసంగంలో సొంత పార్టీ టీడీపీ కేడర్‌కే ప్రాధాన్యత ఇచ్చారు. బీజేపీ, జనసేన మైత్రిని కేవలం కరివేపాకులా ప్రస్తావించారు. ఎన్నికల ప్రచారాన్ని జిల్లాతోపాటు తన సొంత కుప్పం నుంచే ప్రారంభించిన సందర్భంగా, పొత్తులు ఎందుకు? ఏ కారణం చేత కూటమిగా ఏర్పడాల్సి వచ్చింది? అనే విషయాన్ని వివరించకుండానే లక్ష మెజారిటీతో గెలిపించాలని పదేపదే ప్రాధేయపడ్డారు. కనీసం వేదికలపై మిత్రపక్షాలు బీజేపీ, జనసేన నేతలను మాట వరుసకు ఊడా పిలవలేదు. వచ్చిన వారికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతో కూటమి పార్టీ నేతల్లో తీవ్ర అసహనం కనిపించింది.

స్వర్ణరథంపై గణనాథుడి విహారం



ఆలయ మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారి స్వర్ణరథం



సంకటహర చతుర్థి వ్రతం నిర్వహిస్తున్న అర్చక వేదపండితులు, వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

ఐరాల: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి స్వర్ణరథంపై ఆలయ మాడ వీధుల్లో విహరించారు. సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామిని గురువారం రాత్రి అలంకార మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అలంకరణలో, అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం అక్కడి నుంచి ఉత్సవమూర్తులను ఆలయ ఈఓ వెంకటేశు, ఆలయ అధికారులు, అర్చక వేదపండితులు ఊరేగింపుగా తీసుకొచ్చి బంగారు రథంలో కొలువుదీర్చారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ మాడ వీధుల్లో మేళ తాళాలు, మంగళ వాయిద్యాలతో స్వామివారిని ఊరేగించారు.

శాస్త్రోక్తంగా సంకటహర చతుర్థి వ్రతం

ఆలయంలో సంకటహర చతుర్థి వ్రతాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పౌర్ణమి తరువాత నాలుగో రోజు ఆలయంలో సంకటహర చతుర్థి నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా గురువారం ఉదయం, సాయంత్రం రెండు పర్యాయాలు ఆలయ అర్చక వేదపండితులు సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. ముందుగా సిద్ధి, బుద్ధి, సమేత వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఆలయ ఈఓ వెంకటేశు, అధికారులు, ఆలయ అర్చక వేదపండితులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆస్థాన మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలో నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేద మంత్రాల నడుమ సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించారు. ఈ వ్రతానికి హాజరైన భక్తులు వ్రతం ఆచరించారు. ఈ భక్తులకు ఆలయ అధికారులు ప్రత్యేక స్వామివారి దర్శనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పార్టీ విజయం

- గతం కంటే అత్యధిక మెజారిటీ వచ్చేలా పనిచేద్దాం
- రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి





కార్వేటినగరం: మాట్లాడుతున్న ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పాలసముద్రం: వైఎస్సార్‌సీపీలో చేరుతున్న టీడీపీ నాయకులు

కార్వేటినగరం: అందరం కలిసికట్టుగా పనిచేస్తేనే వైఎస్సార్ సీపీ విజయం సాధ్యమవుతుందని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అన్నారు. ఆయన గురువారం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పర్యటించారు. ఆయనతోపాటు విదేశీ వ్యవహారాల సలహాదారు మహాసముద్రం జ్ఞానేంద్రరెడ్డి, సత్యవేడు నియోజకవర్గ పరిశీలకులు దయాసాగర్‌రెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి ఉన్నారు. నాయకులతో కలసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల విజయానికి సంబంధించి దిశా నిర్దేశం చేశారు. పార్టీ విజయం కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ గుర్తింపు తీసుకొచ్చే తనదేనని స్పష్టం చేశారు. గత ఎన్నికల కంటే ఈ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. అనంతరం ఐదు మండలాల్లో విస్తృతంగా పర్యటించి మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ముఖ్యనాయకులను కలిశారు. పాలసముద్రం మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ శివ ప్రకాష్‌రాజు, పార్టీ మండల కన్వీనర్ తులసీయాదవ్, జెడ్పీటీసీలు అన్బుళగన్, పెనుమూరు మండలంలో ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ విజయకుమార్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, దూది మోహన్, జీడీనెల్లూరు మండలంలో సింగిల్‌విండో అధ్యక్షుడు వేల్కూరు బాబురెడ్డి, గ్రీనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ పూర్ణచంద్రారెడ్డి, రైతు అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్వేటినగరంలో ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శిబాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, టెలికాం రాష్ట్ర కార్యదర్శి బండి జగదీష్‌రెడ్డి, జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, వెదురుకుప్పం మండలంలో ఎంపీపీ నాగరాణిరెడ్డి, జెడ్పీటీసీ సుకుమార్, మండల కన్వీనర్ పద్మనాభరెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హేమసుందర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బట్టె సుబ్రమణ్యం, మండల ఉపాధ్యక్షుడు రామయ్య, కోఆప్షన్ మెంబర్ వెంకటేష్, సింగిల్ విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, సీనియర్ నాయకులు భీమశంకర్‌రెడ్డి, గురువారెడ్డి పాల్గొన్నారు.

పాలసముద్రం : మండల కేంద్రంలో టీడీపీ నాయకులు పాండుయాదవ్, నీలమేఘం, మణిరెడ్డి, సంజీవిరాయన్, మాజీ సర్పంచ్ గోపాల్, గోవిందయ్య, స్వామిదాస్, వీరితో 100 మందికిపైగా వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో విజయానందరెడ్డి

చిత్తూరు కార్పొరేషన్: స్థానిక మాపాక్షి చెందిన టీడీపీ యాదవ నాయకులు, కార్యకర్తలు 10 మంది గురువారం వైఎస్సార్‌సీపీలోకి చేరారు. ఆ పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి వారికి కండువా వేసి ఆహ్వానించారు. జగనన్న చేస్తున్న సేవలను చూసి టీడీపీ నుంచి ఈ పార్టీలోకి వచ్చారన్నారు. పార్టీలో చేరిన వారిలో కవిత, మణి, కుప్పయ్య, వేణు, వెంకటేష్, దశరథ ఉన్నారు.

టీడీపీ మాటల తూటాలు..

వలంటీర్ల రాజీనామాలు

- ఆయా మండలాల ఎంపీడీవోలకు అందజేత
- ఆ వేధింపులు భరించలేమని వెల్లడి



పాలసముద్రం: రాజీనామా పత్రాన్ని కార్యదర్శికి అందిస్తున్న గోపి



గుడిపాల: చిత్తపార సచివాలయంలో రాజీనామా పత్రాలతో వలంటీర్లు

గుడిపాల: టీడీపీ నాయకులు మాటల తూటాలతో వలంటీర్లపై అక్కసు వెళ్లగక్కుతుండడంతో, ఆవేదనకు గురైన వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు మండలాల్లో వలంటీర్లు గురువారం రాజీనామా పత్రాలను ఆయా ఎంపీడీఓలకు సమర్పించారు. వారు మాట్లాడుతూ పేదల గడప వద్దకు సంక్షేమ పథకాలు అందించడంతో కీలకపాత్ర పోషిస్తున్న వలంటీర్లను తీవ్రవాదులతో పోల్చుతూ మాట్లాడుతున్న టీడీపీకి ప్రజలు బుద్ధి చెప్పాల్సిన సమయం వచ్చిందని చెప్పారు. వలంటీర్లను ఉగ్రవాదులతో పోల్చడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవడానికి తాము ఇక నుంచి జగనన్న సైనికులుగా మారుతామని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేస్తామని ప్రతిన బూనారు. గుడిపాల మండలంలో 39 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. గురువారం చిత్తపార సచివాలయ పరిధిలో 18మంది వలంటీర్లు ఎంపిడీవో రాజశేఖర్‌రెడ్డికి, 197 రామాపురం సచివాలయం పరిధిలో 21మంది గ్రామ వలంటీర్లు పంచాయతీ కార్యదర్శి మహేష్‌కు తమ రాజీనామా లేఖలను సమర్పించారు.

కూర్మాయిలో 9 మంది

పలమనేరు: మండలంలోని కూర్మాయి పంచాయతీకి చెందిన తొమ్మిది మంది వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామాలను ఎంపీడీవోకు సమర్పించారు. వారు మాట్లాడుతూ తాము ప్రజలకు సేవ చేయాలని ఇందులోకి వచ్చామన్నారు. కానీ తమపై ప్రతిపక్షాలు టెర్రరిస్టులుగా ముద్ర వేయడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై నేరుగా వైఎస్సార్‌సీపీ జెండాను మోస్తూ జగనన్నను మళ్లీ సీఎం చేసుకుంటామని చెప్పారు.

మామడుగు గ్రామ వలంటీర్లు మూకుమ్మడిగా..

గంగవరం: మండలంలోని మామడుగు సచివాలయ పరిధిలోని 12 మంది గ్రామ వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా తమ పదవులకు రాజీనామా చేశారు. గ్రామ సచివాలయంలో తమ రాజీనామా పత్రాలను సచివాలయ కార్యదర్శికి అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామ వలంటీర్లను టెర్రరిస్టులతో పోల్చిన టీడీపీ నేత బొజ్జల సుధీర్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

వేధింపులే కారణం

పాలసముద్రం: నా రాజీనామాకు టీడీపీ, జనసేన నేతల వేధింపులే కారణమని వెంగళరాజుకుప్పం వలంటీర్ గోపి అన్నారు. గురువారం వలంటీరు ఉద్యోగానికి రాజీనామా చేసి, కార్యదర్శి ఇందిరకు అందించారు. గోపి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్న తనను టీడీపీ, జనసేన నేతలు వేధింపులకు గురి చేస్తున్నారని చెప్పారు. అందుకు తాను స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. ఇకపై ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న జగనన్న గెలుపుకోసం పనిచేస్తానని స్పష్టం చేశారు.



వి.కోట: రాజీనామా పత్రాలను చూపుతున్న వలంటీర్లు

ఒకే రోజు 159 మంది వలంటీర్ల రాజీనామా

వి.కోట: మండలంలోని పలు పంచాయతీలకు చెందిన 159 మంది వలంటీర్లు గురువారం స్వచ్ఛందంగా రాజీనామా చేసి పత్రాలను ఎంపీడీఓకు అందించారు. మండలంలోని గోనుమాకులపల్లి సచివాలయ పరిధిలోని 19 మంది వలంటీర్లు, అంబేద్కర్‌నగర్‌లో 33 మంది, భారత్‌నగర్‌లో 14 మంది, పత్రపల్లిలో 23 మంది, ముదరందొడ్డిలో 23మంది, మద్దిమాకులపల్లిలో 9, సుద్దులకుప్పం 12, పెద్దభర్నిపల్లి 12 కుంబార్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలో 14 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. వారు మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు వలంటీర్లు ఉగ్రవాదులంటూ వ్యాఖ్యలు చేయడంతో నిరసనగా రాజీనామాలు చేసినట్లు స్పష్టం చేశారు.



గుడిపాల: 197రామాపురంలో రాజీనామా చేసిన వలంటీర్లు



పలమనేరు: రాజీనామా పత్రాలను చూపుతున్న కూర్మాయి వలంటీర్లు



గంగవరం: రాజీనామా పత్రాలను చూపుతున్న గ్రామ వలంటీర్లు

గొల్లమడుగు చెక్‌పోస్ట్‌లో రూ.93వేలు సీజ్

గుడిపాల: మండలంలోని గొల్లమడుగు చెక్‌పోస్ట్‌లో గురువారం వాహనాల తనిఖీల్లో భాగంగా రూ.93వేలు సీజ్ చేసినట్లు ఎన్నికల ఎస్ఎస్‌టీ టీమ్ లీడర్ గణపతి తెలిపారు. వేలూరు నుంచి సత్యసాయి జిల్లాకు ఈచర్ వాహనంలో ఎటువంటి రసీదులు లేకుండా తీసుకెళుతున్న రూ.93వేలను సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఏఎస్ఐ రాజేంద్ర, హెడ్‌కానిస్టేబుల్స్ జయరామ్, గణపతి ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

గంగవరం: వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన సంఘటనలు గురువారం చోటుచేసుకున్నాయి. సీఐ చిన్నగోవింద్ కథనం మేరకు బైరెడ్డిపల్లె మండలం బేలుపల్లెకు చెందిన క్రిష్టారెడ్డి(55) మండలంలోని తిప్పిదొడ్డి క్రాస్‌కు వచ్చాడు. రోడ్డు దాటుతున్న సమయంలో నంగిళి వైపు వెళ్తున్న కారు ఢీకొనడంతో వెంటనే ముళబాగిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ క్రిష్టారెడ్డి మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

వి.కోట: మండలంలోని గందారు మాకులపల్లెకు చెందిన లేట్ శీనప్ప భార్య సుశీల (35) గురువారం రాత్రి జాతీయరహదారిపై తీవ్రగాయాలతో మృతి చెందినట్లు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్ అమలు

- హోం ఓటింగ్ విధానంపై అవగాహన ముఖ్యం
- ఇంటింటి ప్రచారంపై త్వరలో ఈసీ స్పష్టత
- పార్టీ కార్యాలయాల బయట బ్యానర్లకు అనుమతి తప్పనిసరి
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్



ఈవీఎం గోడౌన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఎన్నికల కోడ్‌ను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రంగుల విషయంలో ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేవన్నారు. పార్టీల గుర్తులు, ఫొటోలు ఉంటే కోడ్ పరిధిలోకి వస్తాయని తెలిపారు. జిల్లాలో ప్రైవేట్ స్థలాల్లో ఉన్న ఆయా పార్టీల జెండాలు, స్టిక్కర్స్‌ను ఎక్కడా తొలగించలేదన్నారు. పబ్లిక్ స్థలాల్లో ఉన్న బ్యానర్లను తొలగించినట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆయా పార్టీ కార్యాలయాల బయట బ్యానర్లు పెడితే అనుమతులు తీసుకోవాలని స్పష్టంచేశారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం జరగబోయే ఎన్నికలలో దివ్యాంగులకు, 85 ఏళ్ల వయసు నిండిన వారి కోసం హోం ఓటింగ్ (ఇంటివద్దకే ఓటింగ్) అనే విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఈ విధానంపై అవగాహన ముఖ్యమన్నారు. హోం ఓటింగ్ అమలుకు ఎన్నికల సంఘం ప్రత్యేక షెడ్యూల్ ఇస్తుందని, ఆ తర్వాత విధి విధానాలు తెలియజేస్తామని చెప్పారు. జిల్లాలో దాదాపు 26 నుంచి 27 వేల మంది హోం ఓటింగ్‌కు అర్హులుగా గుర్తించామన్నారు. వలంటీర్ల రాజీనామాలను ఎంపీడీఓలు ఆమోదించాల్సి ఉంటుందని తెలిపారు. వలంటీర్ల రాజీనామాలను ఆమోదించాల్సింది ఎంపీడీఓలేనని స్పష్టం చేశారు.

క్షేత్రస్థాయిలో పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు

జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పకడ్బందీగా ఎన్నికల కోడ్‌కు వ్యతిరేకంగా వచ్చే ఫిర్యాదులను పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఆయా పార్టీలు ప్రచారాలు చేసే 48 గంటల ముందు అనుమతులు తప్పనిసరిగా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు ప్రకటనలు ఇవ్వాలంటే ఖచ్చితంగా ఎంసీఎంసీ కమిటీ అనుమతి పొందాలని చెప్పారు. అనుమతులు లేకుండా ప్రచార వాహనాల్లో డీజే సౌండ్లు పెట్టకూడదని తెలిపారు. ఇంటింటి ప్రచారానికి సంబంధించి త్వరలో ఈసీ విధివిధానాలు ప్రకటిస్తుందని చెప్పారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల పరిధిలోగల కమాండ్ కంట్రోల్ రూమ్ వివరాలను పార్టీల ప్రతినిధులకు అందజేయాలని డీఆర్ఓ పుల్లయ్యకు సూచించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఉన్న ఈవీఎంల గోడౌన్‌ను రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. పోలింగ్‌కు పది రోజుల ముందు ఈవీఎంలను జిల్లా కేంద్రం నుంచి నియోజకవర్గాలకు తరలించనున్నట్లు తెలిపారు. మే 9 వ తేదీన మరోసారి ఈవీఎంల ను పరిశీలించనున్నట్లు వివరించారు. సమావేశంలో చిత్తూరు అసెంబ్లీ ఆర్ఓ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, అట్లూరిశ్రీనివాసులు, సురేంద్రకుమార్, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

వారిద్దరూ ఇక శాశ్వతంగా మాజీలే..!

- కమీషన్‌లు తీసుకోలేదని మాజీ మంత్రి ప్రమాణం చేస్తారా?
- ఇరుకైన సందులో చంద్రబాబు సభ ఎందుకు పెట్టారు ?
- ముస్లింలకు మోదీ 2019లో డేంజర్.. ఇప్పుడు సూపరా?
- చంద్రబాబు, అమర్‌పై ఎమ్మెల్యే వెంకటేగౌడ ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: మాజీ సీఎం చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇద్దరూ ఇక శాశ్వతంగా మాజీలేనని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పేర్కొన్నారు. పట్టణ వైఎస్సార్‌సీపీ నేతలతో కలసి స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రోడ్డు పనుల విషయంగా మాజీమంత్రి అమరనాథ రెడ్డి పది శాతం కమీషన్ తీసుకున్నారని ఆధారాలతో సహా తాను ఇదే శివాలయంలో ప్రమాణం చేస్తానని దమ్ముంటే మాజీ మంత్రి గుడికి రావాలని సవాల్ విసిరారు. అమరన్నకు బినామీలుగా ఉన్న శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ పొందిన రోడ్డు పనులు చేయకపోతే ప్రజల ఇబ్బందులను చూసి ఫిబ్రవరి 27న వారితో తానే మాట్లాడానన్నారు. వారి సమ్మతితోనే గ్యారిసన్ కంపెనీకి రూ.4.95 కోట్లకు సబ్‌కాంట్రాక్టిచ్చి 70శాతం పనులు చేశారన్నారు. ఇందుకు సంబంధించి గత నెలలో రూ.3.75కోట్లు బిల్లు శ్రీనివాస కన్‌స్ట్రక్షన్‌కు చేరిందన్నారు. ఈ నగదును గ్యారిసన్‌కు ఇవ్వకపోతే వారు వి.కోట పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాస కంపెనీపై ఫిర్యాదు చేశారని వెల్లడించారు. దీంతో చేసేదిలేక శ్రీనివాస కంపెనీవారు గ్యారిసన్‌కు 10శాతం కమీషన్ పట్టుకొని డబ్బులిచ్చారన్నారు. ఆ కమీషన్ మాజీమంత్రి అమరనాథ రెడ్డి తీసుకుంది నిజం కాదా? అని ప్రశ్నించారు. ఈ కమీషన్ సొమ్ము తీసుకోలేదని మాజీ మంత్రి పట్టణంలోని శివాలయంలో ప్రమాణం చేయాలని, శుక్రవారం ఉదయం మీడియా సాక్షిగా తాను ప్రమాణం చేసేందుకు ఆలయంలో సిద్ధంగా ఉంటానన్నారు.

కోవిడ్‌లో ఈ మందు ఎక్కడికెళ్లిందో..

అన్ని వ్యాధులకు అమరనాథరెడ్డి మందు బాగా పనిచేస్తుందని చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందని, అదే నిజమైతే మొన్న కోవిడ్‌లో అమర్ వ్యాక్సిన్ వేయచ్చుగా అని ఎద్దేవా చేశారు. కోవిడ్‌లో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే అమరన్న బెంగళూరులో దాక్కుంటే, చంద్రన్న హైదరాబాద్‌లో దాక్కున్న సంగతి రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. ఇదే అమర్ వైఎస్సార్‌సీపీలో ఉన్నప్పుడు చంద్రబాబును నానా మాటలు తిట్టి, ఇప్పుడు చంద్రబాబును పొగుడుతున్నారంటే అది స్వార్థ రాజకీయం కాదా అని ప్రశ్నించారు.

టీడీపీకి జాకీలేసినా లాభం లేదు

కుప్పకూలిన టీడీపీకి ఎన్ని పార్టీలు జాకీలేసి లేపినా లాభం లేదన్నారు. ఎలాగూ టీడీపీకి ఓటమి తప్పదని చంద్రబాబుకు తెలుసన్నారు. తాను జైలుకెళ్లకుండా ఉండేందుకే మోదీ కాళ్లమీదపడి ఆయన చెంతన చేరారని జోస్యం చెప్పారు. 2019 ఎన్నికల్లో మోదీ డేంజర్ అని ప్రచారం చేసిన చంద్రబాబు, ఇప్పుడేమో మోదీ ఉంటేనే మైనారిటీలకు మేలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

జాతీయనేత సభ జవిళివీధిలోనా..?

ఎంతో రాజకీయ అనుభవం ఉన్న జాతీయ నేత చంద్రబాబు చిన్నపాటి సందుగా ఉన్న పలమనేరు జవిళివీధిలో సభను పెడతారా అని ప్రశ్నించారు. ఎందుకంటే జనం రారని తెలిసి స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌ల పేరిట జనాన్ని ఏమార్చుతున్నారని విమర్శించారు. తనను పనికిమాలిన ఎమ్మెల్యేగా వర్ణించిన చంద్రబాబు గుర్తుపెట్టుకోవాల్సిన విషయం ఏంటంటే.. ఈ పనికిమాలిన ఎమ్మెల్యేనే, టీడీపీ మాజీ మంత్రిని 33 వేల మెజారిటీతో చిత్తు చేసిందన్నారు. చంద్రబాబు మాయమాటలను నమ్మే రోజులు పోయాయని స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో ఓటరే షూటరై చంద్రబాబు అండ్‌కోను ఇంటికి పంపి జగనన్నను సీఎం చేయడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, చెంగారెడ్డి, ప్రహ్లాద, కౌన్సిలర్లు రహీంఖాన్, కోదండరామయ్య, రవి, రాజేష్, రమేష్‌రెడ్డి, శ్యామ్, నాగరాజు, శ్యామ్‌సుందర్‌రాజ్, హయాత్, షబ్బీర్, హైదర్, ముజ్జు, నరేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉన్నత ఆశయం ముఖ్యం

చిత్తూరు కలెక్టరేట్ : ఉన్నత విద్యనభ్యసించే విద్యార్థులకు ఉన్నత ఆశయం ముఖ్యమని సీనియర్ సివిల్ జడ్జి డా.కరుణకుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం వార్షికోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన కరుణకుమార్ మాట్లాడుతూ అమ్మాయిలు గడపదాటడమే తప్పుగా భావించే కాలంలో కళాశాల స్థాపనకు తమ వంతు సహాయాన్ని అందించిన కళాశాల స్థాపకుల సేవలు గొప్పవన్నారు. వేల సంఖ్యలో విద్యార్థినులు కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి ఉన్నత స్థాయిలో ఉన్నారంటే కళాశాల వ్యవస్థాపకుల చొరవవల్లేనని తెలిపారు. సీపీడీసీ సెక్రటరీ, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వరచౌదరి మాట్లాడుతూ ఒక కుటుంబం అభివృద్ధి మహిళ విద్యతోనే సాధ్యమవుతుందన్నారు. మరొక అతిథి దశరథరెడ్డి మాట్లాడుతూ నేటి యువత సాంకేతికంగా అభివృద్ధి చెందినప్పుడే దేశపురోగతి సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం ఆ కళాశాలలో ఆరు గ్రూపులలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులకు ఒక్కొక్కరికి రూ.4 వేలు చొప్పున రూ.1లక్ష స్కాలర్‌షిప్పులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ మనోహర్, వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హైవేపై నకిలీ అవతారం

చిత్తూరు రూరల్: తిరుపతి– బెంగళూరు జాతీయ రహదారిపై కొందరు వ్యక్తులు నకిలీ అవతారమెత్తారు. కమర్షియల్ టాక్స్ అధికారులు అంటూ ఇతర రాష్ట్రాల వాహనాలను ఆపి రికార్డులను తనిఖీ చేశారు. ప్రభుత్వ విధుల వాహనం పేరుతో స్టిక్కర్లు వేసుకుని హల్‌చల్ చేశారు. దీనిపై రవాణాశాఖ అధికారులు స్పందించారు. నకిలీ అధికారుల కారు నంబరును గుర్తించారు. త్వరలో సీజ్ చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.